సాక్షి మంచిర్యాల

సోమవారం, 12, మే, 2025

సైనికుల క్షేమం కోరి..


సాహితి


రాధిక


అశ్విత

దండేపల్లి: ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులతో పోరాడుతున్న భారత సైన్యం క్షేమంగా ఉండాలని లక్సెట్టిపేట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు నరేందుల సాహితి, అక్కనపెల్లి రాధిక, అశ్విత గూడెం సత్యనారాయణస్వామి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకునేందుకు ముగ్గురు మహిళలు 240 మెట్లను మోకాళ్లపై నడిచి ఎక్కారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.5 /28.4

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి


గూడెంలో మాట్లాడుతున్న మోతీలాల్

దండేపల్లి: వరి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని గూడెం, రంగంపల్లెలో కొనుగోలు కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. అక్కడి నుంచి కన్నెపల్లి సమీపంలోని శ్రీవెంకటేశ్వర రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. ధాన్యం బస్తాల అన్‌లోడింగ్‌లో ఆలస్యం చేయవద్దని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ బొద్దుల భూమన్న ఉన్నారు.

ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సింగాపూర్, నంనూర్, గుడిపేటల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం తెచ్చి ఎన్నిరోజులవుతుందని అడిగారు. నిబంధనల మేరకు తీసుకువచ్చిన ధాన్యాన్ని తూకం వేసి వెంటనే తరలించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు.

రాజారెడ్డికి కళాకిరిటి సాఫల్య పురస్కారం


పురస్కారం ప్రదానం చేస్తున్న సమితి సభ్యులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో సాహితి సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కవి, సమాజ సేవకుడు బోనగిరి రాజారెడ్డికి కళాకిరిటీ జీవన సాఫల్య పురస్కారం ఆదివారం ప్రదానం చేశారు. ఈసందర్భంగా రాజారెడ్డి సాహిత్యంపై శతవధాని మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ పరిచయం చేశారు. ఉన్నది ఉన్నట్లే, నేనింతే, విత్తనాలు అలజడి ఎన్నో పుస్తకాలు రచించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ గొంతుకలు, సాహితీ సుగంధాలు అనే పుస్తకాలకు సంకలన బాధ్యతలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సాహితీ సంరక్షణ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వామన్‌రావు, శ్రీనివాస్, కవులు బ్రహ్మయ్యాచార్య, దాసరి శ్రీనాథ్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో డీసీపీ పూజలు


పూజలు చేస్తున్న డీసీపీ భాస్కర్

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని శ్రీకొండగట్టు అంజనేయ స్వామిని డీసీపీ భాస్కర్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. డీసీపీ వెంట ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఏఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు దూరంగా ఉండాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: ఈనెల 20న పలు జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్, పాకిస్తాన్ యుద్ధ వాతావరణం ఉన్న ఈ విపత్కర పరిస్థితిలో రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలు తమ ఉనికిని చాటుకోవడం కోసం సమ్మెకు పిలుపు ఇవ్వడం సరికాదన్నారు. ఈ సమ్మెకు కార్మికులు మద్దతు ఇవ్వొద్దని కోరారు. దేశానికి అండగా నిలవాల్సిన ఈ సమయంలో దేశ సమగ్రతకు విఘాతం కలిగించేలా సమ్మె చేయవద్దని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యతిపత్తి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, ఆకుల హరి, రమేష్, బోయిన మల్లయ్య, జిల్లా తిరుపతి, గొల్ల మహేందర్, కిరణ్‌కుమార్, అరుణ్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులకు కొత్త భవనాలు

- మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు నిధులు
- ఒక్కో కోర్టుకు రూ.81 కోట్ల చొప్పున మంజూరు
- 5 ఎకరాల చొప్పున స్థలం కేటాయింపు



మంచిర్యాలక్రైం: తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత, జిల్లా న్యాయస్థానాలను కూడా ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలిక భవనాల్లో వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ క్రమంలో న్యాయ నిర్మాణ్ ప్రణాళికలో భాగంగా జిల్లా న్యాయస్థానాలకు కొత్త భవనాల నిర్మాణానికి రూ.81 కోట్లు కేటాయించింది. దీంతో త్వరలో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 2004లో కోర్టులు ఏర్పాటయ్యాయి. రెండు దశాబ్దాలుగా అద్దెభవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కోర్టుల సంఖ్య 9కి పెరిగినా సొంత భవనాలు లేకపోవడంతో న్యాయవాదులు, న్యాయమూర్తులు మౌలిక సౌకర్యాల లోపం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది, దీంతో దీర్ఘకాల నిరీక్షణకు తెరపడనుంది.

రూ.162 కోట్లతో ఆధునిక భవనాల నిర్మాణం

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో న్యాయ నిర్మాణ ప్రణాళిక కింద కోర్టు భవనాలు నిర్మించనున్నారు. ఇందులో కేంద్రం 60%, రాష్ట్రం 40% నిధులను భరిస్తాయి. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణం కోసం రూ.162 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ. 81 కోట్లు కేటాయించారు. ఈ భవనాలు నాలుగు అంతస్తులతో, ఒక బేస్‌మెంట్‌తో ఆధునిక డిజైన్‌లో నిర్మిస్తారు. బేస్‌మెంట్‌లో 88 కార్లు, 62 ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. ప్రతీ అంతస్తు 43 వేల నుంచి 44 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో, మొత్తం కోర్టు భవనం 2,87,743.58 చదరపు అడుగుల వరకు ఉంటుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు అంతస్తుల నిర్మాణానికి సిద్ధంగా ఉండేలా డిజైన్ చేశారు. ఈ భవనంలో ఫ్యామిలీ, పోక్సో కోర్టులు కూడా ఏర్పాటు చేస్తారు.

2027 నాటికి పూర్తి

కోర్టు భవనాల నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ ఈ నెల రెండో వారంలో ఖరారు కానుంది. టెండర్లు ఖరారైన వెంటనే, పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన 24 నెలల్లో, అంటే 2027 నాటికి పూర్తిచేయాలని ఉన్నత న్యాయస్థానం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భవనాలు ఆధునిక సౌకర్యాలతో, తూర్పు అభిముఖంగా, విశాలమైన గాలి, వెలుతురు సౌకర్యాలతో నిర్మిస్తారు. నిర్మాణానికి సంబంధించిన మోడల్ స్ట్రక్చర్ ఇప్పటికే సిద్ధం చేయబడింది.

స్థలం కేటాయింపు..

మంచిర్యాల జిల్లాగా ఏర్పడక ముందే పలు కోర్టులు మంజూరయ్యాయి. 2004 నుంచి న్యాయస్థానాలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచే కోర్టులకు సొంత భవనాలు కావాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించినా స్థల కేటాయింపు విషయంలో రాజకీయ జోక్యం కారణంగా జాప్యం జరిగింది. ఈ క్రమంలో 2016లో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలుగా ఏర్పడ్డాయి. దీంతో కొత్త జిల్లాలకు కోర్టులు ఏర్పాటు అవశ్యమైంది. 2022 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా కోర్టులను విభజించి కొత్త జిల్లాల వారీగా కోర్టులు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కోర్టులు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా కోర్టు కోసం నస్పూర్‌లో ఐదెకరాల భూమిని కలెక్టర్ భారతి హోళ్లికేరి కేటాయించారు. ఈస్థల కేటాయింపు కోర్టు భవన నిర్మాణానికి మార్గం సుగమం చేసింది. తాజాగా కొత్త భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి.


స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్ భారతి హోళ్లికేరి

నిరీక్షణ ఫలించింది..

మంచిర్యాల జిల్లా కాక ముందే స్థానిక అవసరాల దృష్ట్యా పలు కోర్టులు ఏర్పడయ్యాయి. 2004 నుంచి అద్దె భవనాల్లోనే కోర్టులు కొనసాగుతున్నాయి. సొంత భవనాల కోసం 20 ఏళ్లుగా విన్నవిస్తూ వస్తున్నాం. ఎట్టకేలకు మా నిరీక్షణ ఫలించింది. జిల్లా కోర్టు భవన నిర్మాణానికి రూ.81 కోట్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. కోర్టు భవన నిర్మాణంతో న్యాయవాదులు, కక్షిదారుల సమస్యలు తొలగిపోతాయి.

– బందవరం జగన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మంచిర్యాల జిల్లా

'భూభారతి'తో సమస్యల పరిష్కారం

- కలెక్టర్ కుమార్‌దీపక్


భీమారంలో భూభారతి సదస్సులో రైతు అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం: ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల్లో కొన్ని ధరణిలో పరిష్కరించలేకపోయామని తెలిపారు. సాదాబైనామలకు పట్టాహక్కులు కల్పించాలని పలువురు రైతులు కలెక్టర్‌ను కోరగా అందుకు ఆయన అంగీకరించారు. భీమారం రెవెన్యూ శివారులోని 21 సర్వే నంబర్‌లో భూమి ఉన్నవారికి పట్టాలు లేవని, పట్టాహక్కులు ఉన్న రైతులకు భూమిలేదని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందిస్తామని, ఈమేరకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సదానందంను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా గతంలో కొనుగోలు చేసిన భూములకు అమ్మకందారుల నుంచి పత్రాలు ఉంటే పట్టా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సదానందం, ఎస్సై శ్వేత, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎఫ్‌పీవోలుగా.. పీఏసీఎస్‌లు..

- కేంద్రం కీలక నిర్ణయం
- జిల్లాలో 12 సంఘాలు గుర్తింపు..

దండేపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను(పీఏసీఎస్) రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా(ఎఫ్‌పీవో)గా మార్చేందుకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో మంచిర్యాల జిల్లాలోని 12 సహకార సంఘాలను ఎఫ్‌పీవోలుగా ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)తో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సహకార శాఖ చర్యలు చేపట్టింది.

12 సంఘాలు ఎఫ్‌పీవోలుగా..

జిల్లాలో మొత్తం 20 సహకార సంఘాలు ఉండగా, వీటిలో 23 వేల మందికిపైగా సభ్యులు ఉన్నారు. ఈ సంఘాలు ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు, పంట రుణాలు, ఎరువుల విక్రయాలు వంటి సేవలను అందిస్తున్నాయి. మొదటి దశలో 12 సహకార సంఘాలను ఎఫ్‌పీవోలుగా మార్చేందుకు గుర్తించారు. మార్పు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

ఎఫ్‌పీవోల ద్వారా చైతన్యం

సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఎఫ్‌పీవోల ద్వారా ఆదాయాన్ని పెంచే కార్యక్రమాలను అమలు చేయనున్నారు. జిల్లాలో ఎఫ్‌పీవోల ద్వారా ఎరువుల దుకాణాలు, విత్తన ఉత్పత్తి కేంద్రాలు, ధాన్యం కొనుగోళ్లు, ఇతర వ్యాపార కార్యకలాపాలను నిర్వహించనున్నారు.

ఆర్థిక సహాయంతో ఆదాయ వృద్ధి


ఎఫ్‌పీవోగా గుర్తించిన నెల్కివెంకటాపూర్ పీఏసీఎస్

ఎఫ్‌పీవోల ఏర్పాటు కోసం సభ్యులు కలిసి రూ.15 లక్షలు జమ చేస్తే, అదనంగా రూ.15 లక్షల రుణం మంజూరు చేస్తారు. ఈ నిధులతో ఆదాయాన్ని పెంచే కార్యకలాపాలను చేపడతారు. అంతేకాక, ఎఫ్‌పీవోల నిర్వహణ కోసం ఏడాదికి రూ.6 లక్షల చొప్పున మూడేళ్లపాటు ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ చర్యల ద్వారా జిల్లాలోని సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు, రైతులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఏర్పడనుంది.

మొదటి విడతలో 12 సంఘాలు..

జిల్లాలో 20 సహకార సంఘాలు ఉండగా, అందులో 12 సంఘాలను మొదటి విడతలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీవో)లుగా గుర్తించడం జరిగింది. ఇందుకు సంబందిచిన ప్రక్రియ కొనసాగుతోంది. సహకార సంఘాలను ఎఫ్‌పీవోలుగా మార్చడంతో మరింత అభివృద్ధి చెందుతాయి.

– మోహన్, డీసీవో, మంచిర్యాల

కార్మిక చట్టాల రక్షణకు ఐక్య పోరాటం

జైపూర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఐక్య పోరాటం చేయాలని సీఐటీయూ అనుబంధ హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గోమాస ప్రకాశ్ అన్నారు. మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఇందులో భాగంగా జైపూర్ మండలం ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి గ్రామాల్లో హమాలీలతో కలిసి సమ్మె పోస్టర్లు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరసే కుట్రలను తిప్పకొట్టాలన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ 20న జరిగే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్నిరంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోమాస ప్రకాశ్, హమాలీలు


లయన్స్‌క్లబ్ వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో మాతృమూర్తులను సన్మానిస్తున్న సభ్యులు

ఘనంగా మాతృదినోత్సవం

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్, వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం మాతృదినోత్సవం నిర్వహించారు. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. తర్వాత 40 మంది మాతృమూర్తులను సత్కరించారు. భోజనం అందించారు. కార్యక్రమంలో వి.మధుసూదన్‌రెడ్డి, హన్మంతరావు, వినయ్‌కుమార్, రామాంజనేయులు, కారుకూరి చంద్రమౌళి, భాగ్యలక్ష్మి, ఇందిరాదేవి, కె.మంగారెడ్డి, రజినిరెడ్డి, డాక్టర్ విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వనితావాక్కు ఆధ్వర్యంలో..

వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోఫౌండర్స్ తాళ్లపల్లి కవిత, కుర్మ సునీత, జ్యోత్స్న చంద్రదత్, చిగురు మంజుల, కొండా శైలజ, బద్రి శ్రీదేవి, సంగీత, సత్యవతి, కమల పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపు.. బోధనకు మెరుగు..!



జిల్లా సైన్స్ కేంద్రంలో శిక్షణ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ చౌదరి

- రేపటి నుంచి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
- ఇప్పటికే రిసోర్స్ పర్సన్లకు ట్రైనింగ్..

మంచిర్యాలఅర్బన్: ఎన్‌సీఈఆర్టీ, విద్యా మంత్రిత్వ శాఖ 2021–22లో సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సాధన సర్వేలో తెలంగాణ విద్యార్థుల పనితీరు జాతీయ సగటు కంటే తక్కువగా నమోదైంది. అలాగే, పీజీఐ, అసర్ నివేదికలు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో వివిధ స్థాయిలలో లోటును సూచించాయి. ఈ నేపథ్యంలో, విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరచడానికి, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుంది, దీని ద్వారా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యా నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా ఉంది.

శిక్షణ కార్యక్రమం నిర్మాణం..

రాష్ట్రంలోని అన్ని విద్యా విభాగాలకు చెందిన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ అందించబడుతుంది. జిల్లాలో 1,811 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, 1,130 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జీటీ) ఈ కార్యక్రమంలో శిక్షణ పొందనున్నారు. శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు వివిధ స్థాయిలలో రిసోర్స్ పర్సన్‌లను(ఆర్‌పీ) ఎంపిక చేశారు. ప్రతీ జిల్లా నుంచి ప్రాథమిక స్థాయిలో ఎనిమిది మంది ఎస్జీటీలు, ఉన్నత స్థాయిలో సబ్జెక్టుకు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌ల చొప్పున మొత్తం 36 మంది స్టేట్ ఆర్‌పీలుగా శిక్షణ పొందారు. ఈ స్టేట్ ఆర్‌పీలు జిల్లా స్థాయి డీఆర్‌పీలకు, డీఆర్‌పీలు మండల స్థాయి ఎంఆర్పీలకు శిక్షణ అందిస్తారు. స్కూల్ అసిస్టెంట్‌లకు జిల్లా కేంద్రంలో ఏకకాలంలో శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రణాళికాబద్ధమైన శిక్షణ కోసం..

ఈ వేసవి శిక్షణ శిబిరాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ చౌదరి ఆదేశించారు. ఈ సందర్భంగా, జిల్లా సైన్స్ సెంటర్‌లో ఎస్జీటీ డీఆర్‌పీలు, గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్రాల స్కూల్ అసిస్టెంట్ డీఆర్‌పీలతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణను సద్వినియోగం చేసుకునేలా రిసోర్స్ పర్సన్‌లు కీలక పాత్ర పోషించాలని చౌదరి సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రమేష్, వామనమూర్తి, రామన్న, కేవీ సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సమావేశం శిక్షణ కార్యక్రమం యొక్క సమర్థవంతమైన అమలుకు దిశానిర్దేశం చేసింది.

శిక్షణ లక్ష్యాలు..

ఈ శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి రూపొందించబడింది. ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను అందించడం, విద్యా సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం వంటి అంశాలపై ఈ శిక్షణ దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమం విద్యార్థులలో క్లిష్టమైన ఆలోచన, సమస్యా పరిష్కార నైపుణ్యాలు, మరియు సృజనాత్మకతను పెంపొందించడంలో ఉపాధ్యాయులకు సహాయపడుతుందని భావిస్తున్నారు. అలాగే, ఈ శిక్షణ రాష్ట్రంలో విద్యా నాణ్యతను జాతీయ సగటుతో సమానం చేయడానికి ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించబడుతోంది.

దీర్ఘకాలిక ప్రభావం

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ శిక్షణ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు మెరుగుపడటం వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెరుగుతాయి. ఇది విద్యా నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఈ కార్యక్రమం జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉంటూ, విద్యార్థులలో 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది.

ఇంటికే పౌష్టికాహారం

- వేసవి సెలవుల నేపథ్యంలో కొత్త విధానం
- అంగన్‌వాడీ లబ్ధిదారులకు అందజేత

మంచిర్యాలటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాయి. వేసవి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలలో సెలవులు ప్రకటించింది. పౌష్టికాహారం కోసం లబ్ధిదారులు కేంద్రాలకు రావడం లేదు. దీంతో ఆహార సరఫరా నిలిచిపోతోంది. ఈ సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు వారానికి ఒకసారి నేరుగా పౌష్టికాహారం అందించే విధానం అమల్లోకి తెచ్చింది.

లబ్ధిదారులకు ఊరట

మే నెలలో ఎండల తీవ్రత కారణంగా గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రాకపోవడంతో పౌష్టికాహారం అందడం ఆగిపోయేది. ఈ సమస్యను గుర్తించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల యూనియన్‌లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించాయి. దీంతో, మే 1 నుంచి 15 వరకు టీచర్లు, 16 నుంచి 31 వరకు ఆయాలు కేంద్రాలను తెరిచి, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో అంగన్‌వాడీ నిర్వాహకులతోపాటు లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

జిల్లాలో పౌష్టికాహార సరఫరా ఇలా..

జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 74 మినీ, 895 ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. 2023లో మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రాల నుంచి 4,245 మంది గర్భిణులు, 3,186 మంది బాలింతలు, 45,455 మంది చిన్నారులు పౌష్టికాహారం పొందుతున్నారు. రోజూ భోజనం, గుడ్లు, పాలు, స్నాక్స్ అందించాల్సి ఉంటుంది. వేసవి సెలవుల సమయంలో వారానికి ఒకసారి నేరుగా సరుకులు పంపిణీ చేస్తున్నారు.

సవాళ్లు, పర్యవేక్షణ అవసరం

కొందరు లబ్ధిదారులు కేంద్రాలకు రాకపోవడం, టీచర్లు/ఆయాలు పంపిణీలో నిర్లక్ష్యంచేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవచ్చు. ఈ నేపథ్యంలో, జిల్లా ఉన్నతాధికారులు కఠిన పర్యవేక్షణతో పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కొత్త విధానం లబ్ధిదారులకు నిరంతర ఆహార సరఫరాకు దోహదపడనుంది.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	969
గర్భిణులు	4,245
బాలింతలు	3,186
చిన్నారులు	45,455

సరుకులు అందేలా చర్యలు



జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు పౌష్టికాహారానికి సంబంధించిన సరుకులు సక్రమంగా అందించేలా చర్యలను తీసుకుంటున్నాం. టీచర్లు, ఆయాలు 15 రోజుల చొప్పున అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉంచాల్సిందే. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం ఉండడంతో, అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు వచ్చేలా టీచర్లు తగు చర్యలను తీసుకునేలా చూస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు వచ్చినప్పుడు ఎలాంటి పౌష్టికాహారం తీసుకుంటారో, కేంద్రాలకు రాకున్నా అదే పౌష్టికాహారం తీసుకునేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం.

– రవూఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

ఆదివాసీలు రాజకీయంగా ఎదగాలి


మాట్లాడుతున్న రాహుల్ బల్

జన్నారం: ఆదివాసీలను చైతన్యపర్చి రాజకీయంగా ముందుకు తీసుకురావడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ ప్రోగ్రాం కన్వీనర్ రాహుల్ బల్ అన్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఆదివాసీలు రాజకీయంగా ఎదగలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు రాజకీయంగా ఎదిగేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకురాలు ఆత్రం సుగుణ, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బతో యువకుడి మృతి


గొంతయ్య (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లికి చెందిన మానెపల్లి గొంతయ్య(18) వడదెబ్బ కు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొంతయ్య..కాగజ్‌నగర్ పట్టణంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇంటి వద్ద కూలీ పని వెళ్తున్నాడు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బూరుగూడ పరిధిలోని బీఈడీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం..మండలంలోని జన్కాపూర్‌కు చెందిన అబ్దుల్లా బిన్ సాల్‌హే (42) తనసొంత పని నిమిత్తం కాగజ్‌నగర్‌కు సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ కారులో వెళ్తున్నాడు. బీఈడీ కళాశాల సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో ఆయన కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో అతన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, మృతుడు అడ బ్రాంచి పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్నాడు. భార్య ఆస్మాబేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.

మానవతామూర్తులు

- వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం
- నిరంతరం రోగులకు సేవలు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



వైద్యరంగంలో నర్సులు.. కనిపించే దేవతలు.. సేవామూర్తులు. కాలిన గాయాలతో దవాఖానలకు వచ్చే బాధితులైనా.. రోడ్డు ప్రమాద క్షతగాత్రులైనా.. పురిటినొప్పులతో వచ్చే గర్భిణులైనా.. మరి ఇంకెవరైనా తోబుట్టువులా మొదట పలుకరించేది వాళ్లే. రోగులే దైవంగా సేవలందిస్తూ వైద్య రంగానికే వన్నె తెస్తుండగా, నేడు (సోమవారం) అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– నిర్మల్‌చైన్‌గేట్/ఆసిఫాబాద్‌అర్బన్


ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్స్(ఫైల్)

ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా

నర్సింగ్ వృత్తికి హుందాతనం తెచ్చిన ఫ్లోరెన్స్ నై టింగేల్ జయంతిని పురస్కరించుకుని ఏటా మే12 న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన కృషిని తలుచుకుంటూ ఏటా వేడుకలు జరుపుకుంటున్నారు. ఈక్రమంలో ఏటా నర్సింగ్ విభాగంలో వి శిష్ట సేవలు అందిస్తున్న నర్సులకు రాష్ట్రపతి అవా ర్డులు అందించి సముచితంగా సత్కరిస్తున్నారు.

నైటింగేల్ స్ఫూర్తితో..



నైటింగేల్ స్ఫూర్తితో విధులు నిర్వహిస్తున్నా. జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందిస్తున్నా. ఆపదలో ఉన్న వారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. 2023లో నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్నా.

– విజయలక్ష్మి, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆస్పత్రి

అదృష్టంగా భావిస్తున్నా



నర్సింగ్ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నా. నర్సుగా పనిచేస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు. రోగులకు సేవ చేయడం కోసం ఈ వృత్తిని ఎంచుకున్నా. 25 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ ఐదుసార్లు జిల్లా కలెక్టర్‌తో ఉత్తమ పురస్కారం అందుకున్నా.

– అన్నపూర్ణ, హెడ్‌నర్స్, సీహెచ్‌సీ నర్సాపూర్(జి)

సేవ చేస్తున్నా



రోగులకు సేవ చేయడం దేవుని సేవగా భావిస్తున్నా. కరోనా సమయంలో విధులకు వెనుకాడలేదు. ఆపదలో ఉన్నవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. రోగులందరిని కుటుంబ సభ్యులుగా భావిస్తా. అందుకే రోగం ఎంత భయంకరమైనదైనా సేవచేయగలుగుతున్నా. – పుష్పలత, హెడ్‌నర్స్, జిల్లా జనరల్ ఆసుపత్రి

ఆత్మీయ పలకరింపు



అన్ని ఉద్యోగాలకంటే ఉన్నతమైన వృత్తి నర్సు. వ్యాధి నయమయ్యాక రోగే పిలిచే ఆత్మీయ పలకరింపు గొప్ప ఆనందాన్నిస్తుంది. దీని ముందు ఏదైనా తక్కువే.

భూలక్ష్మి స్టాఫ్‌నర్స్, జిల్లా జనరల్ ఆసుపత్రి

ఇష్టంతో విధులు



ఆసిఫాబాద్‌అర్బన్: 35 ఏళ్లుగా నర్సింగ్ వృత్తిలో కొనసాగడం గర్వంగా ఉంది. ఇష్టంతోనే విధులు నిర్వహిస్తున్నాం. కుటుంబ సభ్యుల సహకారంతో రోగులకు సేవలందిస్తున్నాం. కరోనా సమయంలో చికిత్స అందించాం. ప్రభుత్వం తమను గుర్తించి పారితోషికం ప్రకటించాలి.

– ఇందుమతి, నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

సేవలకు గుర్తింపు



1993లో విధులో చేరాను. మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల్లో ప్రజలకు సేవలు అందించడం తృప్తినిచ్చింది. విధుల్లో రోగులకు సేవ చేయడంతో గుర్తింపు ఉంది. కోవిడ్ బాధితులకు సేవల అందించాను. గ్రామీణులకు సేవ చేయడం సంతోషంగా ఉంది.

– సఫియా బేగం హెడ్‌నర్సు

పారితోషికం ఇవ్వాలి



రాత్రింబవళ్లు రోగులకు సేవలందిస్తున్న నర్సులకు ప్రభుత్వం పారితోషికం అందించాలి. ఆసుపత్రికి వచ్చే వారు మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా మాట్లాడినా వారిని ఓపికతో సర్దిచెప్పి చికిత్స చేసి పంపిస్తాం. ఖాళీల కొరతతో పని భారం పెరుగుతుంది. నర్సు పోస్టులను భర్తీ చేయాలి. మొదట ఆశవర్కర్‌గా పని చేశాను. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ వృత్తిలో చేరాను.

– హేమలత, నర్సింగ్ ఆఫీసర్

తృప్తినిస్తుంది



ప్రతీరోజు రోగులకు సేవ చేయడం తృప్తినిస్తుంది. భర్త ప్రోత్సాహంతో నర్సింగ్ ఉద్యోగాన్ని సాధించాను. అత్యవసర సమయంలో వైద్యం చేసే నర్సులకు ప్రత్యేక పారితోషికాలు ఇవ్వాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – కవిత, నర్సింగ్ ఆఫీసర్

వసతులు కల్పించాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సులకు వసతులు కల్పించాలి. రాత్రివేళ విధులు నిర్వహించేవారికి సెక్యూరిటీ ఇవ్వాలి. ఉన్నతాధికారుల సలహాలతో రోగులకు సేవలందిస్తున్నాం. ఈ వృత్తిలోకి రావడానికి ముందు హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో పనిచేశాను. ఆ అనుభవంతో ఉద్యోగం సాధించాను. – ఆర్.సునీత, నర్సింగ్ ఆఫీసర్

ఎలాంటి ఇబ్బంది లేదు



రోగులకు సేవలు చేయడం అదృష్టంగా భావిస్తాను. ప్రస్తుతం విధ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేదు. ఆసుపత్రి సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆదేశాలతో రోగులకు సేవలు చేస్తున్నాను. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. కరోనా సమయంలో పేషంట్లకు సేవ చేయడం జీవితంలో మరువలేనిది. పూర్తిస్థాయిలో వైద్యులు నియమించాలి. – స్రవంతి, నర్సింగ్ ఆఫీసర్

ఆనందంగా ఉంది



పేదలకు వైద్య సేవలందించడం ఆనందంగా ఉంది. గ్రామీణప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడికి ఎంతోమంది వస్తున్నారు. వారిని మా కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేస్తున్నాం. ప్రతీ రోగిపై శ్రద్ధపెడుతూ వైద్యం అందిస్తాం. రేయింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిస్తుంది.

– మంజుల, స్టాఫ్‌నర్స్, ఖానాపూర్

సేవచేసే భాగ్యం



రోగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే. ఆ అవకాశం కేవలం నర్సులకే దక్కుతుంది. రోగులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం దేంట్లో ఉండదు. నర్సింగ్ వృత్తిలో మంచి సంతృప్తిని పొందుతున్నా.

– కవిత, స్టాఫ్‌నర్సు, భైంసా

ఇష్టంగా వైద్యసేవలు



నర్సుగా విధుల్లో చేరిన పట్టి నుంచి ఇష్టంగా రోగులకు వైద్యసేవలుఅందిస్తున్నా. అప్పుడే పుట్టిన చిన్నపిల్లలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. నర్సులందరికీ నైటింగేల్ స్ఫూర్తి కావాలి.

– మనీషా, స్టాఫ్‌నర్స్ జిల్లా ప్రసూతి ఆసుపత్రి

అందరికీ అవకాశం దక్కదు



సేవచేయాలన్న కోరిక ఉన్నా అందరికీ ఆ అవకాశం దక్కదు. ఆసుపత్రికి వచ్చేవారిని రోగులుగా కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందిస్తున్నాం. త్వరగా వ్యాధి నయమై వెళ్లాలని కోరుకుంటాం.

– శృతి, జిల్లా ప్రసూతి ఆసుపత్రి

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- రేపే ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 8195 మంది విద్యార్థులు


బెల్లంపల్లి బజారుఏరియా హైస్కూల్ పరీక్ష కేంద్రం

బెల్లంపల్లి: రాష్ట్రంలో ఉన్న సాంకేతికవిద్య కళాశాలల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 13న పాలిసెట్–2025 పరీక్షకు సర్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, వాంకిడి, మంచిర్యాల, బెల్లంపల్లిలో మొత్తం 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 8,195 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రవేశ పరీక్షఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరగనుంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష ఆయా కేంద్రాల్లోకి చేరుకోవాలి. పరీక్ష ప్రారంభమైన ఒక్కనిమిషం ఆలస్యమైన కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష సమయానికి ముందస్తుగానే కాలకృత్యాలు తీర్చుకుని రావల్సి ఉంటుంది. మధ్యలో వెళ్లే పరిస్థితి లేదు.

విద్యార్థులు పాటించాల్సిన సూచనలు..

- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, హెచ్‌బీ పెన్సిల్, షార్పనర్, ఎరేజర్, నీలం లేదా నలుపు బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలి.
- రఫ్ వర్క్ కోసం ప్రశ్నాపత్రంలో చివర రెండు ఖాళీపేజీలు అందుబాటులో ఉంటాయి. బయటి నుంచి కాగితాలు తీసుకురావొద్దు.
- హాల్‌టికెట్‌పై ఫొటోలేని విద్యార్థులు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణపత్రంతో పరీక్షకు హాజరు కావాలి.
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వాచీలు, తదితర తీసుకురావడానికి అనుమతి లేదు.

ప్రశాంతంగా పరీక్ష రాయాలి



విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. పరీక్ష కేంద్రంలో చేతికి ప్రశ్నాపత్రం అందజేసిన తర్వాత ముందస్తుగా సూచనలు చదివి అనుసరించాలి. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. చదివిన అంశాలను గుర్తు చేసుకుని జవాబులు రాస్తే పరీక్షలో నెగ్గడానికి వీలుంటుంది.

– డాక్టర్ ఎం.దేవేందర్, మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	విద్యార్థులసంఖ్య	పరీక్ష కేంద్రాలు
ఆదిలాబాద్	1,102	03
నిర్మల్	2,422	08
కుమురం భీం ఆసిఫాబాద్ (వాంకిడి సెంటర్‌కలుపుకుని)	1,032	04
మంచిర్యాల	2,558	10
బెల్లంపల్లి	1,081	03

ఎన్‌హెచ్–44పై దారికాచిన మృత్యువు

- మూడు జిల్లాల పరిధిలో మూడు యాక్సిడెంట్లు
- నిర్మల్ జిల్లాలో తండ్రి, కూతురు దుర్మరణం
- ఆదిలాబాద్ జిల్లాలో బావ మృతి, బావమరిదికి గాయాలు..
- కామారెడ్డి జిల్లాలో భార్య మృతి, భర్తకు గాయాలు
- మూడూ కారు ప్రమాదాలే కావడం విషాదం..

కశ్మీర్ నుంచి కన్యాకుమారిని కలిపే ఎన్‌హెచ్ 44పై ఆదివారం మృత్యువు దారికాచింది. మూడు జిల్లాల పరిధిలో ఇదే రోడ్డుపై జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇక్కడ విషాదం ఏమిటంటే మూడు ప్రమాదాలకు కారణం కార్లే.. మూడు ప్రమాదాలు కారు డ్రైవర్ల తప్పిదంతోనే జరిగాయి. నిర్మల్ బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఆగిఉన్న ఐచర్ వాహనాన్ని కారుడ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తండ్రి, కూతురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బావ మృతి చెందగా, బావమరిది గాయపడ్డాడు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో కారు అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ మూడు ప్రమాదాలు ఆ కుటుంబాల కలలను, ఆశలను ఛిన్నాభిన్నం చేశాయి.

నిర్మల్ జిల్లాలో..


శంకర్, కృతిక(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రవీంద్రనగర్‌కు చెందిన బండి శంకర్(48) బ్యాటరీ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని సంతోషంగా చూసుకునేవారు. ఆయనకు కవల ఆడపిల్లలు వైదిక, కృతిక(22) ఉన్నారు. వైదిక నిజామాబాద్‌లో వైద్య విద్య అభ్యసిస్తుండగా, కృతిక హైదరాబాద్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కృతిక పరీక్షలు పూర్తి కావడంతో వేసవి సెలవుల కోసం ఇంటికి తీసుకురావడానికి శంకర్ తన సొంత కారులో డ్రైవర్ విలాస్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం రాత్రి కృతికను తీసుకుని ఇంటికి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో నిర్మల్ జిల్లా నీలాయిపేట వద్ద వారు ప్రయాణిస్తున్న కారు, రోడ్డుపై ఆగి ఉన్న ఐచర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. శంకర్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన కృతికను స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆమె అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. డ్రైవర్ విలాస్ కాళ్లకు తీవ్ర గాయాలై, చికిత్స కోసం మహారాష్ట్రలోని ఆస్పత్రికి తరలించారు. మరో గంటలో ఇంటికి చేరి, కుటుంబంతో సంతోషంగా గడపాలన్న కృతిక ఆశలు ఈ ప్రమాదంతో ఆవిరయ్యాయి. తండ్రి, కూతురు మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. వారి రోదనలు చూసినవారిని కంటతడి పెట్టించాయి.

ఆదిలాబాద్ జిల్లాలో

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద జరిగిన మరో ప్రమాదంలో వెంకటేశ్(35) మృతిచెందాడు. నిర్మల్ జిల్లా వివేక్‌నగర్‌కు చెందిన వెంకటేశ్, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అన్వేష్ బావ, బావమరిది. పని నిమిత్తం శనివారం ఆదిలాబాద్‌కు వెళ్లిన వెంకటేశ్ ఆదివారం బావమరిదితో కలిసి నిర్మల్‌కు బయల్దేరాడు. టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని వారి కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్ తీవ్రంగా గాయపడి, నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అన్వేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో..


ప్రణీత మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయర్ ప్రణీత (20) మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కంఠం గ్రామానికి చెందిన అమూల్ నేవీలో విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సెలవులు రద్దు కావడంతో, ఆదివారం సాయంత్రం భార్య ప్రణీతతో కలిసి కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రైలింగ్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రణీత తీవ్రంగా గాయపడగా, అమూల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ప్రణీత మృతిచెందింది. అమూల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అమూల్, ప్రణీతకు ఏడాది క్రితం పెళ్లయింది.

'అల్ఫోర్స్' విద్యార్థులకు అభినందన



కరీంనగర్: ఈఏపీసెట్- 2025 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో సత్తా చాటిన 'అల్ఫోర్స్' విద్యార్థులను ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి ఆదివారం అభినందించారు.

'ట్రినిటి' విజయభేరి



కరీంనగర్: ఈఏపీసెట్ ఫలితాల్లో కరీంనగర్ ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934,1104, 1166, 1546, 1619, 1795, 1950తో పాటు మొత్తం 89మందికి పైగా విద్యార్థులు 10వేలలోపు ర్యాంకులు సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ట్రినిటి జూనియర్ కళాశాలలు విద్యా రంగంలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయని తెలిపారు. ఐఐటీ–జేఈఈ(మెయిన్స్), అడ్వాన్స్‌డ్, నీట్, ఈఏపీసెట్ వంటి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించారని ప్రశంసించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు. ఈ విజయానికి బాటలు వేసిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.

'శ్రీ చైతన్య' ర్యాంకుల ప్రభంజనం


జి.వైష్ణవి


బి.మనోఘ్న

కరీంనగర్: ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. గోకులకొండ వైష్ణవి 810, బి.మనోఘ్న 968, బి.సాత్విక్ 1,142, పి.స్ఫూర్తిశ్రీ 1,527, బి.శ్రావణి 1,803, పి.బ్లెస్సీ సుసన్ 2,106, పి.చందన 2165, పి.భరత్‌రెడ్డి 2,815, పి.అజితేష్ 3,016, కె. అనూహ్య 3,503, వి. ప్రవీణ్ 3,623, డి.రిషి 3,996, జి.అర్చన 4,171, ఆర్.శ్రీయాన్ 4,246, వి.శివాణి 4,570, బి.స్రవంతి 4,957, 5000 లోపు 16 ర్యాంకులు, 10000 ర్యాంకుల లోపు 51 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



25 ఏళ్ల తర్వాత మళ్లీ బడికి

దండేపల్లి మండలంలోని ద్వారక జే.వీ.ఎస్ఆర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత అదే బడిలో కలుసుకున్నారు. ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – దండేపల్లి

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం.. కుంటాల మండలం లింబా (బి) గ్రామానికి చెందిన సంజీవ్ (30) ఆదివారం తానూరు మండలం బెంబరలో నిర్వహించిన అంత్యక్రియలు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో చెట్టుకు ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న ట్రైయినీ ఎస్సై.. ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మద్యం మత్తులో ఉండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.